క్లుప్తంగా

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం



మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ కార్పొరేటర్లు, కార్యకర్తలు శనివారం పలు డివిజన్లలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)లకు ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. కరపత్రాలను అందజేశారు. తమ కుటుంబాలకు మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఎన్నుకుంటామని ప్రజలు ఈ సందర్భంగా నాయకులకు వివరించారు. నగరంలోని 22వ డివిజన్‌లో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, 5వ డివిజన్‌లో ఇన్‌చార్జ్ వేముల వనబాబు, 13వ డివిజన్‌లో కార్పొరేటర్ గాజుల శ్రీదేవి, డివిజన్ ఇన్‌చార్జ్ గాజుల భగవాన్, 8వ డివిజన్‌లో కార్పొరేటర్ శ్రీరాం చిన్నా, 2వ డివిజన్‌లో కార్పొరేటర్ పరింకాయల విజయచంద్రకుమార్, 34వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌చార్జ్ బడే భానుతేజ, 3వ డివిజన్‌లో మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జి ఇంటింటి ప్రచారం చేశారు.

ఉత్తమ జేటీఓ అవార్డు స్వీకరణ



చల్లపల్లి: టెలికం శాఖ చల్లపల్లి సబ్ డివిజన్ జూనియర్ టెలికం అధికారి డీ రామకృష్ణ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో 2023–24 సంవత్సరానికి బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్ చేతులమీదుగా అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ అందుకున్నారు. బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ కనెక్షన్లు అత్యధికంగా చేయటంతో పాటు, గత నాలుగేళ్లుగా ఫైబర్ నెట్ కనెక్షన్లు ఇస్తూ, ఇంటర్‌నెట్ అంతరాయం లేకుండా సేవలు అందిస్తున్న సందర్భంగా రామకృష్ణ ఈ అవార్డు అందుకున్నారు.

ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట

కోసూరువారిపాలెం(మోపిదేవి): మండల పరిధిలోని కోసూరువారిపాలెం శివారు గొల్లపాలెంలో నూతనంగా నిర్మించిన వీరాంజనేయస్వామివారి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శనివారం ఉదయం 8.34 గంటలకు నిర్వహించారు. వేదపండితులు తొలుత ఆలయ ప్రాంగణంలో భక్తి శ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ వీరాంజనేయస్వామి, గణపతి, శ్రీ కృష్ణ పరమాత్ముని విగ్రహాలు ప్రతిష్ఠించారు. అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు, యువనేత సింహాద్రి వికాస్‌బాబు స్వామివారిని దర్శించుకున్నారు. వీరాంజనేయస్వామి వారు భక్తులను ఎల్లవేళలా కాపాడాలని కోరారు. మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రవచనం

మచిలీపట్నంటౌన్: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక చిలకలపూడిలోని శ్రీ విజయ సీతారామస్వామి ఆలయంలో శ్రీ మద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీ రామాయణం సేవా ధర్మం అనే అంశంపై ప్రవచనం నిర్వహించారు. ప్రవచనకర్త వడ్లమన్నాటి మారుతి ప్రసంగించారు. ఈ ప్రవచనం ఆలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమానికి టీటీడీ ప్రతినిధి తురగా ప్రసాద్ పర్యవేక్షించారు.

అంబేడ్కర్ అంటే టీడీపీకి చిత్తశుద్ధి లేదా?

కృత్తివెన్ను: తెలుగుదేశం పార్టీకి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటే ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని జైభీం కృత్తివెన్ను మండల కార్యదర్శి వి.వెంకటరత్నం అన్నారు. బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో ఆ పార్టీ ముద్రించిన కరపత్రాల క్యాలెండర్‌లో ఏప్రిల్ 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ముద్రించలేదన్నారు. దీనినిబట్టి వారికి అంబేడ్కర్ అంటే ఎంత చులకన భావమో తెలుస్తుందన్నారు. ఇదే క్యాలెండర్‌లో చంద్రబాబు జన్మదినాన్ని ముద్రించి, అంబేడ్కర్ జయంతిని విస్మరించడం దారుణమన్నారు. అంటే టీడీపీకి దళితుల ఓట్లతో పనిలేదన్నారు. ఇప్పటికైనా టీడీపీ వారి చులకన భావాన్ని అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మక్తాలంక(మోపిదేవి): మండలంలోని మక్తాలంకలో కారంకి వెంకటేశ్వరావు కుమారుడు సిద్దయ్య (42) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే అవనిగడ్డ ఎమ్మెల్యే రమేష్‌బాబు తనయుడు యువనేత సింహాద్రి వికాస్‌బాబు సిద్దయ్య మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

కలెక్టర్ డీకే బాలాజీ



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికల విధులు కేటాయించబడిన సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కలెక్టరేట్లో తన చాంబర్లో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు కేటాయించబడిన వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, అత్యవసర సేవల కింద గుర్తించబడిన వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం వినియోగించుకునే వారు ఫారం–12, ఫారం–12డీ ద్వారా ఈనెల 16వ తేదీలోగా ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దరఖాస్తు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే వారికి మే 2 నుంచి 10వ తేదీ వరకు ఆయా నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కి దరఖాస్తు చేసిన వారు ఆయా ఫెసిలిటేషన్ సెంటర్‌లకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కొరకు వచ్చిన దరఖాస్తుల సంఖ్యను బట్టి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోస్టల్ బ్యాలెట్ ముద్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టం ద్వారా సర్వీస్ ఓటర్స్ కోసం ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిందని, ఈ విధానం గురించి కలెక్టర్ డెమో ద్వారా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి షాహిద్ బాబు, జెడ్పీ సీఈవో ఆనందకుమార్ ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల కేటాయింపు సక్రమంగా నిర్వహించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల డిస్పాచ్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ శనివారం కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్ వద్ద పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఆన్‌లైన్‌లో తొలి విడత ర్యాండమైజేషన్ డేటా ఆధారంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలను ఆయా నియోజకవర్గాలకు డిస్పాచ్ అయ్యేవిధంగా చూడాలన్నారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా ఈ ప్రక్రియ కట్టుదిట్టంగా జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాలకు కేటాయించబడిన నంబర్లు గల ఈవీఎంలను, వీవీ ప్యాట్‌లను స్కానింగ్ చేసి తగిన భద్రతతో ఆయా నియోజకవర్గాలకు తీసుకువెళ్లాలన్నారు. ఈ ప్రక్రియలో ఒక నియోజకవర్గానికి వెళ్లవలసిన ఈవీఎం మరో నియోజకవర్గానికి వెళ్లకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు. ఇక్కడి నుంచి కట్టుదిట్టమైన భద్రత మధ్య ఆయా నియోజకవర్గాలకు ఈవీఎంలు రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఆయా నియోజకవర్గాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో వీటిని కట్టుదిట్టంగా భద్రపరుచుటకు రిటర్నింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్ఓ కె.చంద్రశేఖరరావు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, ఈవీఎంల నోడల్ అధికారులు డీపీఓ నాగేశ్వరనాయక్, ఏడీ మార్కెటింగ్ నిత్యానందం, ఎన్నికల విభాగం సమన్వయ అధికారి దుర్గా కిషోర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్

మాజీ మంత్రి పేర్ని నాని



గుడివాడ టౌన్: పట్టణంలో జరగనున్న 'మేమంతా సిద్ధం' సభకు వస్తున్న ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృష్ణా జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. ఆయన శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో జరగనున్న 'మేమంతా సిద్ధం' కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారన్నారు. సభలో జగన్‌మోహన్ రెడ్డి తన పరిపాలన వలన ప్రజలకు ఏం మేలు జరిగింది? తన పాలనను ప్రజలు ఎందుకు మెచ్చుకుంటున్నారు? తన ఏలుబడిలో రాష్ట్రంలో ఏయే వర్గాలకు ఎలా మేలు జరిగింది? అనేది వివరిస్తారని తెలిపారు. ప్రభుత్వం చేసిందేమిటి, ఇంకా చేయాల్సిందేమిటి అనే విషయాలపై మాట్లాడతారు. వేలాదిగా ప్రజలు తరలివచ్చి ఆయన సందేశాన్ని ఆలకించి, జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ అభ్యర్థులను ఆశీర్వదించాలని పేర్నినాని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

సీఎంగా వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకుందాం

ప్రజాదీవెనలో ఉప్పాల రాము, హారిక



కంచడం ప్రజాదీవెనలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము

బంటుమిల్లి: రాష్ట్రంలో మరోమారు స్వచ్ఛమైన పాలన రావాలంటే రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని, అందుకు మనమంతా సాదరస్వాగతాన్ని పలుకుదామని పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. శనివారం ఆయన మండలంలోని కంచడం, ముంజులూరు గ్రామాలలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలసి ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. దంపతులిరువురికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. పేదలకు మరింత సంక్షేమం అందాలన్నా, మన బిడ్డల బంగారు భవిష్యత్తు వెల్లివిరియాలన్నా జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఇన్ని సంవత్సరాల రాజకీయ చరిత్రలో లబ్ధిదారుల ఖాతాలకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్న అని అన్నారు. ఇటువంటి మంచి మనస్సున్న వ్యక్తికి మనందరి ఆశీర్వాదం ఉండాలన్నారు.

రెండు ఓట్లు ఫ్యానుకే..

అసెంబ్లీ అభ్యర్థిగా ఉప్పాల రాము, ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి చంద్రశేఖరరావు బరిలో ఉన్నారని మరింత సంక్షేమ పాలన కోసం మీ రెండు ఓట్లు ఫ్యానుగుర్తుపై వేసి వారికి అఖండ మెజారిటీ ఇవ్వాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వి.చినబాబు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

16 లోగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయాలి

ఈఆర్వో వెంకటరమణ



పెడన: పోస్టల్ బ్యాలెట్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి దరఖాస్తులను ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు మాత్రమే తీసుకుంటామని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పీవోలు, ఏపీవోలు నుంచి శిక్షణ కేంద్రాల్లో ఫారం–12 దరఖాస్తులను అందజేసి వాటిని పూర్తి చేసి తిరిగి తీసుకోవడం జరిగిందన్నారు. ఫారం–12 దరఖాస్తుతో ఎంప్లాయి ఐడీ, ఆధార్ కార్డు జిరాక్స్, ఎన్నికల విధులుంటే దానికి సంబంధించిన ఉత్తర్వు కాపీ అందజేయాలన్నారు. పెడన నియోజకవర్గంలో ఇతర జిల్లాలకు చెందిన వారు ఇక్కడ ఉద్యోగం చేస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకుంటే వారి వారి నియోజకవర్గాలకు ఆయా దరఖాస్తులను పంపించి ఆ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ పేపర్లను రప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పెడన నియోజకవర్గంలో నివాసం ఉంటూ ఇతర నియోజకవర్గాలలో విధులు నిర్వహిస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రాష్ట్ర ఉద్యోగులు కొందరికి కేంద్ర ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పించిందని ఆర్వో తెలిపారు. పోస్టల్, రైల్వే, బీఎస్ఎన్ఎల్, మెడికల్, ఫైర్, అత్యవసర విభాగాలకు చెందిన ఆయా శాఖల ఉద్యోగుల నుంచి కూడా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. రెండో విడతలో శిక్షణ పొందే పోలింగ్, ఎన్నికల సిబ్బందికి కూడా ఫారం–12 దరఖాస్తులు ఇచ్చి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ నెల 16వ తేదీలోగా పెడనలోని తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటరులో అందజేయాలని ఆర్వో స్పష్టం చేశారు. ఈయనతో పాటు ఏఈఆర్వో కె.రాంబాబు ఉన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

పెడన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెడన నియోజకవర్గంలో నిర్వహించనున్న బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ పెడన పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు కోరారు. శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు, రాజీనామాలు చేసిన వలంటీర్లు, గృహ సారథులు స్థానిక 16 వార్డులో సీఎం వైఎస్ జగన్ రోడ్ షో కార్యక్రమానికి హాజరు కావాలని గడప గడపకు వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా బండారు మల్లి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం పెడన నియోజకవర్గంలో 'మేమంతా సిద్ధం 'బస్సు యాత్ర నిర్వహించనున్నారని తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు తోటమూల సెంటర్లో (చౌరస్తా) కార్యక్రమానికి పట్టణంలోని 23 వార్డులకు చెందిన అన్ని వర్గాల ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ యువజన నాయకులు కటకం నాగ కుమార్, మతీన్‌ఖాన్, రహీం ఖాన్, ఇలియాస్, రహేమాన్ బేగ్, లంకె పెద్ద గోవిందు, ఇషాక్, హమీద్ ఖాన్ (బోటా) రాజీనామా చేసిన వలంటీర్లు ఆరిఫ్, మున్నా, ప్రసన్న, రేణుక, చినబాబు, షాహిన, అస్మా, దిల్షాద్, గృహసారథులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మార్గం అనుసరణీయం

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో ఉప్పాల రాము



గూడూరులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న ఉప్పాల రాము

గూడూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చూపిన మార్గం అనుసరణీయమని వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము అన్నారు. మండల కేంద్రమైన గూడూరులోని మద్దాల ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పాల రాము మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చాక భారత దేశానికి రాజ్యాంగాన్ని అందించడంలో ఆనాడు అంబేడ్కర్ ప్రధాన భూమిక పోషించారన్నారు. బాబా సాహెబ్ దార్శనికతతో రచించిన రాజ్యాంగం నేటికీ అనేక సమస్యలకు పరిష్కారం చూపిస్తోందన్నారు. రాజ్యాంగ నిర్మాత ప్రతిష్టను ఇనుమడింప చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బెజవాడ నడిబొడ్డున 125 అడుగుల అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేయడం మనందరికీ గర్వకారణమన్నారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వస్తున్న ఆనవాయితీని కొనసాగిస్తూ ఈ ఏడాది అంబేడ్కర్ జయంతికి ముందు గూడూరులో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, సర్పంచి లింగం సులోచనారాణి, పీఏసీఎస్ చైర్మన్ కారుమంచి కామేశ్వరరావు, డైరెక్టర్ వేము ఆనంద్, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, నాయకులు యడ్లపల్లి రామ్ సుధీర్, లింగం విజయ్‌కుమార్, మద్దాల పవన్‌కుమార్, అట్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. గూడూరులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పురస్కరించుకుని పీఏసీఎస్ చైర్మన్ కారుమంచి కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఆకుమర్రు నుంచి రామరాజుపాలెం అడ్డరోడ్డు మీదుగా గూడూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మండలంలోని వివిధ గ్రామల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన ఎస్సీ నాయకులు వందలాది ద్విచక్రవాహనాలు, ఆటోలతో గూడూరుకు చేరుకున్నారు. ఉప్పాల రాము కూడా ర్యాలీలో పాల్గొని అంబేడ్కర్ అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపారు.

నిండుతున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్

పనులను పరిశీలించిన కమిషనర్ బాపిరాజు



మోటార్లను పరిశీలిస్తున్న కమిషనర్ బాపిరాజు

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలతో పాటు పెడన మునిసిపాలిటీ, మచిలీపట్నం రూరల్ మండలంలోని 100 పైగా గ్రామాలకు తాగునీరు అందించే తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నింపే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈస్ట్ రైవస్ కాలువ నీటితో ఈ ట్యాంకును 8వ తేదీ రాత్రి నుంచి నింపే పనులు ప్రారంభించారు. ట్యాంక్ పూర్తి సామర్థ్యం 5.19 మీటర్లు కాగా కాలువ వచ్చే నాటికి 2.38 మీటర్ల మేర నీరు ఉంది. ప్రస్తుతం 3.5 మీటర్లకు పైగా నీటితో నింపారు. మరో రెండు, మూడు రోజులు కాలువల ద్వారా నీటి సరఫరా ఉండటంతో చెరువును పూర్తి స్థాయిలో నింపి వేసవిలో ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా చూసేలా చర్యలు చేపట్టారు. ట్యాంకు నింపే పనులను నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు శనివారం పరిశీలించి ఇంజనీర్లకు సూచనలు ఇచ్చారు. నీటి తోడకానికి మరిన్ని మోటార్లను ఏర్పాటు చేస్తున్నట్లు మునిసిపల్ ఇంజనీర్ సాంబశివరావు, డీఈ వరప్రసాద్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ పూర్తిస్థాయిలో నింపితే జూన్‌లో కాలువలకు నీరు విడుదలయ్యే వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని వారు తెలిపారు. వచ్చే నెలలో మళ్లీ కాలువలకు నీరు వచ్చే అవకాశం ఉందని, అందువల్ల తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఉండవన్నారు.

నేటి నుంచి రాములవారి కల్యాణ ఉత్సవాలు



మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన రహదారిలో ఉన్న రుస్తుంబాద భద్రాద్రి శ్రీ రాముల వారి దేవస్థానం స్వామివారి కల్యాణ మహోత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం నుంచి 20వ తేదీ శనివారం వరకు ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ధర్మకర్తల మండలి సన్నాహాలు పూర్తి చేసింది. ఈ నెల 17వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీ భద్రాద్రి సీతారామకల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. రాత్రికి హనుమంత వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తారు. 14వ తేదీ ఆదివారం ఉదయం విష్వక్సేనపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షా బంధనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, జగజ్యోతి, వైనతే పట ప్రతిష్ఠ, తీర్థప్రసాద గోష్ఠి వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామివారిని పెండ్లికుమారునిగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా చేసి నూతన శేష వాహనంపై ఆస్థానోత్సవం చేస్తారు. 15న అగ్నిప్రతిష్ఠ, భేరీ తాడనం, 16న అష్టోత్తర శత (108) కలశాభిషేకం, ఎదుర్కోలు సన్నాహం, అశ్వవాహనంపై ఊరేగింపు 18న శ్రీ భద్రాద్రి శ్రీరాముల వారి పట్టాభిషేక మహోత్సవం, రాత్రికి రథోత్సవం, 19న మహా పూర్ణాహుతి, చక్రస్నానం, శతృంజయ గజవాహన సేవ, 20న పుష్పయాగం, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మే 3వ తేదీన 16 రోజుల పండుగ సందర్భంగా గరుడవాహనసేవ, సహస్ర దీపాలంకరణ సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పెడనకు చేరిన ఈవీఎంలు



స్ట్రాంగ్ రూంకు ఈవీఎంల తరలింపు పనులు పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరమణ, నాయకులు

పెడన: జిల్లా కేంద్రం మచిలీపట్నం నుంచి శనివారం మధ్యాహ్నం పెడన అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు పెడన మార్కెట్ యార్డుకు చేరుకున్నాయి. పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.వెంకటరమణ పర్యవేక్షణలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో వీటిని కంటైనర్ లారీ నుంచి దింపించి స్ట్రాంగ్ రూంలో పెట్టించారు. అసెంబ్లీకి సంబంధించినవి మాత్రమే వచ్చాయని, 280 ఈవీఎంలు, 259 కంట్రోల్ యూనిట్లు, 259 బ్యాలెట్ యూనిట్లు వచ్చినట్లు ఆయా పార్టీల నాయకులకు ఆర్వో వివరించారు. పార్లమెంటుకు సంబంధించి ఈవీఎంలు, సీయూ, బీయూలు ఆదివారం లేదా సోమవారం వస్తాయని, ఆరోజు కూడా తప్పనిసరిగా ఆయా పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలోనే స్ట్రాంగ్‌రూం తలుపులు సీలు తీసి పెట్టిస్తామన్నారు. ఈయనతో పాటు ఏఈఆర్వో, పెడన తహసీల్దారు కె.రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బండారు మల్లికార్జునరావు, కోడూరు శ్రీను, ముత్యాల మురళి, టీడీపీ నాయకుడు యక్కల శ్యామలయ్య, జనసేన నాయకురాలు మట్టా శివపావని, బీజేపీ పట్టణ నాయకుడు ఎం.లక్ష్మీ నారాయణగుప్త తదితరులున్నారు.

విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండండి

పీవోలు, ఏపీవోల శిక్షణలో జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి డీకే బాలాజీ



పీవోలు, ఏపీవోల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

పెడన: ఎన్నికల విధులు నిర్వహించే సమయంలో పీవోలు, ఏపీవోలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ స్పష్టం చేశారు. శనివారం ఆయన పెడన నియోజకవర్గంలోని పీవోలకు, ఏపీవోలకు మండల పరిధిలోని శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల విధులపై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ పీవోలు, ఏపీవోలకు పలు సూచనలు చేశారు. పోలింగ్ బూత్‌లలో తొలుత మాక్ పోల్ తీసుకుంటారని, ఈ మాక్ పోల్ అనంతరం బ్యాలెట్ యూనిట్లు క్లియర్ చేసుకోవాలన్నారు. చాలా మంది క్లియర్ చేయకపోవడం వల్ల ఆ బూత్‌లతో వెయ్యి ఓట్లు ఉంటే 1050 ఓట్లుగా చూపించే పరిస్థితి వస్తుందని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. మాక్ పోల్ సందర్భంగా పోలయిన ఓట్లను క్లియర్ చేసిన తరువాత పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. అలాగే ఏమైనా తప్పులు జరిగినా, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్న పీవో డైరీలో సదరు అంశాన్ని పొందుపరచాలని తెలిపారు. పీవో డైరీలో నోట్ చేయకపోవడం వల్ల ఎన్నికల అధికారులు తీసుకునే క్రమశిక్షణ చర్యలకు గురికావాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగం నుంచి సస్పెండ్ అయినా తిరిగి ఉద్యోగం పొందడానికి చాలా కాలయాపన జరుగుతుందన్నారు. ఎక్కడైనా ఈవీఎంలు మొరాయించినా తక్షణం వాటిని సరిచేసే విధంగా పీవోలు, ఏపీవోలు శిక్షణ పొందాలన్నారు. ఆలస్యం కాకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూసుకోవాలని తెలిపారు. పెడన ఎన్నికల అధికారి పి.వెంకటరమణ, ఏఈఆర్వో కె.రాంబాబు, ఎన్నికల డీటీ కల్పన తదితరులున్నారు. అనంతరం కలెక్టర్ పెడన మార్కెట్ యార్డులోని స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. ఈవీఎంలు, సీయూలు, బీయూలు భద్రపరిచిన విధానం, గోదాము చుట్టూ సీసీ కెమెరాలు, సిబ్బంది పర్యవేక్షణ తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



పోటీల్లో వేసిన అంబేడ్కర్ ముగ్గు

పామర్రు: స్థానిక చెన్నువానిపురంలో ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో పలురకాల పోటీలను నిర్వహించారు. పలువురు మహిళల ఉత్సాహంగా ఈ పోటీలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించామని తెలిపారు. సుమారు 25 మంది మహిళలు పాల్గొన్నారన్నారు. అంతే కాకుండా లెమన్ అండ్ స్పూన్, పరుగు పందెం పోటీలను నిర్వహించామని తెలిపారు. విజేతలకు ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుమతులను అందజేస్తామని పేర్కొన్నారు.

సీఎం బస ఏర్పాట్ల పరిశీలన



సంగమూడి వద్ద సీఎం బస ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

కృత్తివెన్ను: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రలో భాగంగా కృత్తివెన్నులో బసచేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు సంగమూడి హైస్కూల్ సమీపంలో 216 జాతీయ రహదారి పక్కన చేస్తున్నారు. ఏర్పాట్లను శనివారం ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్, ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, దేవస్థాన చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ కొక్కిలిగడ్డ బాపూజీ, అగ్రికల్చరల్ కమిటీ జిల్లాబోర్డు సభ్యులు పట్టపు నాని తదితరులు పరిశీలించినవారిలో ఉన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఓ రాంబాబు

పామర్రు: జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహనకు అగ్నిమాపక వారోత్సవాలను ఈ నెల ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు పామర్రు స్టేషన్ అగ్నిమాపక అధికారి నాగిరెడ్డి రాంబాబు పేర్కొన్నారు. స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో వారోత్సవాల కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కి సమాచారం అందించడం మర్చి పోవద్దన్నారు. అగ్ని ప్రమాద నివారణ పద్ధతులు తీసుకోవాల్సిన చర్యలు ఈ కరపత్రాలలో ముద్రించినట్లు పేర్కొన్నారు. వేసవిలో తరచుగా జరిగే అగ్ని ప్రమాదాల నివారణ గురించి గ్రామాలలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. ఈనెల 20వ తేదీ వరకు ఈ వారోత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర డీఓపీ రామ్‌ప్రసాద్, ఎల్ఎఫ్ఎం నాగరాజు, ఎఫ్ఎం కె.రాజు, హెచ్‌బీ ఎస్.చందు పాల్గొన్నారు.